18—8—82



# తెలియని నీ మనసు

**బయట** స్కూటరు చప్పుడు విని తరుగుతున్న కూర ముక్కల్ని వదిలి కిటికీ దగ్గరకు పరుగెట్టింది మీనాక్షి. ఎదురింటి గేటు దగ్గర రాజారావు కనిపించాడు. హారన్ మోగిస్తున్నాడు. ఎవ్వరూ గేటు తియ్యడానికి రావడం లేదు.

చ! చ! కమలకి అస్సలు జ్ఞానమే లేదు. పాపం అలిసి వస్తాడు గదా. రాగానే ఎదురు రాకూడదూ అని రాజారావు భార్య కమలని మనసు లోనే తిట్టు కుంది మీనాక్షి.

మళ్ళీ హారను మోగించాడు.

ఈ సారి పనిపిల్ల పరిగెట్టుకు వచ్చి గేటు తీసింది. లోపలి కెళ్ళాడు రాజారావు.

ఉస్సురనుకుంటూ మీనాక్షి తిరిగి కూరముక్కలు తరగడంలో పడింది.

మీనాక్షి దినచర్యలో ఇది ఒక భాగం. సరిగ్గా అయిదు దివగానే బయట స్కూటరు చప్పుడు వినిపిస్తుంది. ఎంత పనిలో ఉన్నా వదిలేసి గుమ్మం దగ్గరి కొచ్చి అతన్ని చూస్తుంది. రాజారావు లోపలికి వెళ్ళ గానే తానూ నిట్టూర్చుకుంటూ లోపలి కొస్తుంది.

● ● ● ●

మీనాక్షి తెల్లగా, బొద్దుగా ఉంటుంది. ఆకర్షణీయమైన ముఖం. ఆ వీధిలోకి అమ్మలక్కలకి మీనాక్షి అందం మీద ఈర్ష్య. ఆమె మంచితనం మీద గౌరవం ఉంది.

మీనాక్షి తండ్రి సామాన్య కుటుంబీకుడు. పెళ్ళిళ్ళ మార్కెట్‌లో చవగ్గా దొరికిన సుబ్బారావుకి మీనాక్షి నిచ్చి పెళ్ళి చేసి చేతులు కడుక్కున్నాడు.

సుబ్బారావు నల్లగా, పొట్టిగా ఉంటాడు. అతనికి మీనాక్షి కంటె ఆఫీసు ఫైళ్ళు అందంగా కనిపిస్తాయి. ఇంట్లో కన్నా అతనికి ఆఫీసులో ఉంటేనే బాగుం టుంది. ఒక సరదా కాని, కోర్కె కానీ లేకుండా అలా గబ్బిలంలా ఆఫీసుకి పట్టుకు వ్రేలాడే భర్తని చూస్తే మీనాక్షికి ఏదో కోపం. ఆ కోపాన్ని మరిచిపోవడానికి రోజంతా మౌనం ఏదో ఒక పని కల్పించుకుని చేస్తూ ఉంటుంది.

దాదాపు రెండు నెలల క్రితం.

ఒక రోజు పనిమనిషి, "అమ్మగారూ! ఎదురింట్లోకి లేపేవరో వస్తారంట! వాళ్ళు ఇల్లు కడుగుతున్నారు" అంటూ మీనాక్షితో చెప్పింది.

అప్పటినుంచీ వాళ్ళని గూర్చి వూహాగానాలు చెయ్యటం మొదలెట్టింది మీనాక్షి.

ఇంతకు ముందు ఆ ఇంట్లో ఉండి వెళ్ళిన ఆఫీసరుగారికి ఆరుగురు పిల్లలు. ఆ పిల్లలు ఎప్పుడూ తన ఇంట్లోనే ఉండేవారు. వాళ్ళు చేసే అల్లరిని ఈ వీధివాళ్ళు భరించలేక వాళ్ళెప్పుడు వెళ్ళిపోతారా అని ఎదురు చూశారు.

ఈ సారి ఎటువంటి వాళ్ళొస్తారో అనుకుంది మీనాక్షి.

మర్నాడు ఉదయం పనిమనిషి—

"సాయంత్రం ఆ దొస్తారమ్మా" అంది.

మీనాక్షి ఆ మధ్యాహ్నం నుంచీ వాకిట్లో కిటికీ దగ్గరే కూర్చుంది. మూడు అవుతుండగా ఒక టాక్సీ వచ్చి ఎదురింటి ముందు ఆగింది.

ముందు డ్రైవర్ దిగాడు.

ఆ తరవాత రాజారావు దిగాడు.

అతన్ని చూస్తూనే మీనాక్షి ఆశ్చర్యపోయింది.

'ఇతడు సినిమా హీరోనా ఏమిటి చెప్మా' అనుకుంది. అతని వెనకే సన్నగా, నల్లగా ఉన్న కమల దిగింది. ఆమెను చూసి రాజారావుకి దిష్టి బొమ్మలా ఉందనుకుంది మీనాక్షి.

ఆ మరునాడు పనిమనిషికి టిఫినూ, కాఫీ ఇచ్చి ఎదురింటి వివరాలు సేకరించ సాగింది.

"ఆయనకి ఆదేదో ఆఫీసులో పెద్ద పనేట" అని టిఫిను తినడంలో మునిగిపోయింది పనిమనిషి.

"ఇంకా చెప్పు!"

"టిఫిను బాగా ఉందమ్మా!" రోజూ ఇలా అమ్మగారు టిఫిను పెడితే ఇంకెంత బాగుండునో అనుకుంటూంది.

ఆ మాటలు విని విసుక్కుంది మీనాక్షి.

"అది కాదే! వాళ్ళ కబుర్లేమిటి?"

గటగట మంచినీళ్ళు తాగి తాపీగా చెప్పింది.

"వాళ్ళిద్దరూ అంత ఎక్కువగా మాట్లాడుకోరమ్మా! ఆవిడంతా అదో రకం.

"అంటే ఎలా ఉంటుంది. బాగా కోపిష్టా."

మీనాక్షి ఆత్రంగా అడిగింది:

"ఇంకా ఏం తెలీదమ్మా! వాళ్ళు వచ్చి ఒక్క రోజుకూడా కాలేదుగా!" అంది కాఫీ చప్పరిస్తూ.

అదీ నిజమే అనిపించింది మీనాక్షికి.

"అయినా! ను వ్వక్కడే కదే పని చేసేది. విష యాలు తెలుస్తాయిలే" అని తృప్తి పడింది.

"అబ్బే! లేదమ్మా. నే నక్కడ పని చెయ్యను. ఆళ్ళకి రోజల్లా ఉండే మనిషి కావాలంట. నాకెట్టా కిరుద్ది. ఇంకో అమ్మాయిని చూపించా" అంది.

ఆ మాటలతో నీరసం వచ్చింది మీనాక్షికి. దానికి పెట్టిన కాఫీ, టిఫిను దండగ అనుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది మీనాక్షి.

● ● ● ●

ఎదురింటి వాళ్ళతో పరిచయం చేసుకోవాలనే కోరిక మీనాక్షిలో రోజు రోజుకీ పెరిగి పోసాగింది.

'కమలతో ఎలా స్నేహం చెయ్యడమా' అని ఆలోచించింది. కమల తన ఇంటికి అప్పుకేమైనా వస్తుందేమోనని చూసింది కాని, కమల రాలేదు.

ఒకరోజు సాయంత్రం మీనాక్షి తన బారెడు జుట్టుని దువ్వుకుంటూ తిరిగ్గా వాకిట్లో కూర్చుంది. కమల తమ ఇంటిముందు తోటలో తిరుగుతోంది. కమల తలెత్తి మీనాక్షి వేపు చూసి పలకరింపుగా నవ్వింది. మీనాక్షి పొంగి పోతూ లేచి గబగబా ఫెన్సింగ్ దగ్గరికి పరిగెట్టింది.

"మీరేనా ఈ ఇంట్లో దిగింది!" అనడిగింది మీనాక్షి.

"అవునండి!" అంది కమల.

తర్వాత ఏం మాట్లాడుదామా అని మీనాక్షి ఆలోచించేలోపునే కమల లోపలికి వెళ్ళిపోయింది.

ఆ వేళంతా మీనాక్షి చాలా ఉల్లాసంగా గడిపింది. మర్నాడు వాళ్ళింటికి వెళ్ళాలని నిశ్చయించు కుంది.


భర్త ఆఫీసు కెళ్ళాక, చక్కగా జడ వేసుకుని తనకున్న వాటిల్లోంచి మంచి చీర కట్టుకుని అందంగా తయారయింది. రెండు దాటాక ఇంటికి తాళంవేసి బయలుదేరింది. మధ్యాహ్నం పూట కమల పడుకోదని తన పనిమనిషి చెప్పింది.

మీనాక్షి గేటు తీసుకుని లోపలకు నడిచింది. ఇంటిముందు చిన్న పూలతోట. మొక్కలు అప్పుడప్పుడే తలలు పైకెత్తుతున్నాయి. ఆ మొక్కల్ని దాటి వరండాలోకి అడుగుపెట్టింది. గుమ్మానికి పల్చటి కర్టెను వేలాడుతోంది.

కర్టెను ప్రక్కకు తొలగించి లోపలకు అడుగు పెట్టింది మీనాక్షి.

కమల సోఫాలో పడుకుని పుస్తకం చదువు కుంటోంది. మీనాక్షి హాలంతా ఒక్కసారి కలయ చూసింది. హాల్లో విలువైన వస్తువులే ఉన్నాయి. కానీ, అవి ఉండవలసిన స్థానంలో మాత్రం లేవు. ఇంటి అలంకరణ కమల బద్ధకాన్ని సూచిస్తోంది.

మీనాక్షి చిన్నగా దగ్గింది—తాను వచ్చినట్లు తెలియడానికి. ఆ ధ్వనికి కమల తల నెత్తింది. ఎదురుగా మీనాక్షి.




"రండి, రండి!" అంటూ మీనాక్షిని ఆహ్వానించింది. మీనాక్షి వెళ్ళి ఆవిడ ప్రక్కన సోఫాలో కూర్చుంది.

"ఎండలో వచ్చినట్లున్నారు. మంచినీళ్ళు కావాలా!" కమల అడిగింది.

"వద్దండీ!"

"మేం వచ్చి రెండు నెలలు దాటింది. అయినా ఈ వీధిలో ఎవరూ పరిచయం కాలేదు." కమల అంది.

"నేను ఎప్పటి కప్పుడు రావాలనే అనుకున్నా నండీ. కానీ, పనులవలన కిరలేదు." మీనాక్షి జవా బిచ్చింది.

"మీ పేరు?" కమల అడిగింది.

మీనాక్షి చెప్పింది.

ఇక అక్కడినుండి వారి సంభాషణ భర్తల ఉద్యోగాల మీదనుంచి, నేటి సినిమాల వరకూ సాగింది. మాటల మధ్య కమల తాము చాలా ధనవంతులమని, రాజారావుకి తినడానికి కూడా లేకపోయినా అతని తెలివితేటలు, అందాన్ని మెచ్చి తండ్రి పెళ్ళి చేశాడని చెప్పింది.

ఆ మాటల్లో చాలా స్వాతిశయం కనబడింది మీనాక్షికి.

"మా ఇల్లు చూద్దురు గాని రండి" అంటూ లేచింది కమల. మీనాక్షి కూడా లేచి కమలవెంట వెళ్ళింది.

ఇంటినిండా ఎక్కడపడితే అక్కడ వస్తువులు చిందరవందరగా పడివున్నాయి.

"ఇదేమిటి, ఇవన్నీ ఇలా పడేశారు?" గోడ మీద ఉండాల్సిన ఫోటోలు ఒక మూలపడి ఉంటే అడిగింది మీనాక్షి.

"ఏదండీ! మా పనిపిల్లని తగిలించమన్నాను కానీ, దానికి అందదంట. ఇక ఆయన ఆఫీసులో ప్యూన్ని పిలుద్దామనుకుంటున్నాను" అంది కమల.

బట్టలు కుప్పగా సోఫా మీద పడి ఉన్నాయి.

"మా పనిపిల్ల వచ్చి మడతేస్తుంది. దానికి ప్రతి పనీ చెప్పాలి. దానితో వేగలేకుండా ఉన్నాను" అంది కమల.

అవన్నీ చూస్తుంటే మీనాక్షికి తమ ఇంట్లోని విరిగిన కుర్చీలు, గోడకి వేలాడదీసిన చెదలు పట్టిన ఫోటోలు, తను అపురూపంగా మడతలు పెట్టే చిరిగిన చీరలు జ్ఞాపకం వచ్చాయి. తనకే ఇటు వంటి వస్తువులు ఉంటే ఎంత బాగా సర్దు కునేదో! అనుకుంది.

బెడ్‌రూమ్ చూపించింది కమల.

"ఇది మాత్రం ఆయనే సర్దుతారు. పడుకునే గది శుభ్రంగా ఉండాలిట. ఏమిటో చాదస్తం! ఎలా ఉంటే ఈ జీవితం వెళ్ళదు."

కమల మాటలు వింటుంటే నవ్వాలో, ఏడవాలో తోచలేదు మీనాక్షికి.

ఫోమ్‌బెడ్. కిటికీలకు నీలి తెరలు...ఆ గదిని ఆశ్చర్యంగా చూసింది మీనాక్షి.

తమ ఇంట్లో ముడులతో నిండిన నవారు మంచం, దానిపై చిరిగిన దుప్పటి జ్ఞాపకం వచ్చాయి.

"కమలా!" బయటనుండి ఎవరో పిలిచారు.

"అరె. ఆయనొచ్చేసినట్లున్నారే" అంది కమల.

ఇద్దరూ హాల్లోకి వచ్చారు.

హాల్లో సోఫాలో రాజారావు కూర్చుని ఉన్నాడు. మీనాక్షిని చూసి ఆశ్చర్యపోయాడు. భర్త అలా మీనాక్షిని రెప్పవాల్చకుండా చూడడం కమలకి నచ్చలేదు. చిరాకుపడింది.

'ఏమేమిటి. అప్పుడే వచ్చారు" అనడిగింది కమల.

రాజారావు స్వప్నలోకం నుంచి బయటపడి వచ్చాడు.

"సాయంత్రం ఆఫీసులో మీటింగుంది. అర్జంటుగా కాగితాలు కావాల్సి వచ్చాను" అన్నాడు మీనాక్షి వేపు చూస్తూ.

ఇక తప్పదన్నట్లుగా వారిద్దరిని పరిచయం చేసింది కమల.

"అలాగా" అని లోపల కెళ్ళాడు రాజారావు.

ఎన్నాళ్ళగా మంచో చూడాలనుకున్న దేవుడు ఎదురుగా నిలబడితే ఎలా ఉంటుందో అలా ఉంది మీనాక్షి స్థితి.

"ఇక నేను వెళ్ళొస్తానండీ!" అంది మీనాక్షి. మళ్ళీ అతను కన్పిస్తే, తట్టుకునే శక్తి లేదని పించింది.

కమల వెంటనే—"మంచిది" అంది.

ఇంతలో, "కమలా!" అంటూ లోపలి నుండి రాజారావు పిలిచాడు.

కానీ కమల వినినట్లు పుస్తకం పుచ్చుకుని సోఫాలో కూర్చుంది.

రాజారావు మళ్ళా పిలిచాడు. కానీ కమల లేవ లేదు. అది చూసిన మీనాక్షికి ఆ పుస్తకాన్ని కమల చేతిలోంచి లాక్కుని నాలుగు ముక్కలు చేద్దామని పించింది. ఇంకా సేపు అక్కడుంటే నిజంగా చేస్తానేమోనని భయపడి గబగబా బయటికి నడిచింది మీనాక్షి.

• • • •

ఆ రాత్రంతా మీనాక్షికి నిద్ర పట్టలేదు. రాజారావే ఆమె కళ్ళముందు మెదిలాడు.

తనూ, రాజారావు స్కూటరు మీద కూర్చుని షికారు చేస్తున్నట్లు, వెన్నెల్లో అందమైన తోటలో ఒకరి చేతుల్లో ఒకరు కరిగిపోతున్నట్లు కలలు కంది.

ఆ రాత్రి తన మంచానికున్న నల్లులు గానీ, చినిగిన దుప్పటి గానీ, ఒక విధమైన చెమ్మవాసన వేసే తను గది గానీ ఏదీ మీనాక్షిని బాధించలేదు.

• • •

తెల్లారి మళ్ళీ యథావిధి కార్యక్రమం ప్రారంభమైంది. ఎన్ని పనులున్నా సాయంత్రం అయ్యేసరికి కిటికీ దగ్గరకు రావటం మాత్రం మానలేదు మీనాక్షి.

వారం రోజులు గడిచాయి!

ఒకరోజు పొద్దున్నే కమల మీనాక్షి ఇంటికి వచ్చింది. ఆ సమయానికి మీనాక్షి వంట గదిలో ఉంది.

కమలని చూసి తెగ కంగారు పడింది. ఉన్న రెండు గదుల్లో కమలని ఎక్కడ కూర్చోబెట్టాలో తెలీలేదు మీనాక్షికి.

ముందు గదిలో భర్త కూర్చుని ఉన్నాడు.

"ఏమండోయ్! మీకు నీళ్ళు పెట్టాను" అని భర్తని బాత్‌రూంలోకి తరిమి కమలని ముందుగది లోకి ఆహ్వానించింది.

కమల కూర్చోలేదు!

"నేను ఇంకో గంటలో ఊరెళుతున్నానండీ! ఇల్లు చూస్తూ ఉండండి" అంది.

మీనాక్షి తలూపింది.


కమల వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది.

కాని, మీనాక్షికి ఎన్నో సందేహాలు కలిగాయి! ఈ విడ ఊరికి ఎందుకు వెళుతూంది! మళ్ళీ ఎప్పుడు వస్తుంది! రాజారావు కూడా వెళు తున్నాడా!

ఇవన్నీ జవాబుల్లేని ప్రశ్నలు గానే ఉండి పోయాయి.

సాయంత్రం ఎప్పటిలా అయిదింటికి స్కూటరు చప్పుడు వినిపించింది. దానితో ఊరుకెళ్ళింది కమల ఒక్కతేనని గ్రహించింది మీనాక్షి.

మళ్ళీ అరగంట తరవాత రాజారావు బయటికి వచ్చి ఇంటికి తాళం వేశాడు.



'పాపం! హోటల్లో భోజనానికి వెడుతున్నాడేమో! ఆ భోజనం ఏం సహిస్తుందో?' అనుకుంటూ వరండా లోకి వచ్చింది మీనాక్షి.

గేటు వేస్తూ రాజారావు మీనాక్షి వేపు చూసి చిన్నగా నవ్వాడు.

మీనాక్షి ఒళ్ళు ఝల్లుమంది.

ఏమిటీ ధైర్యం అని అన్పించినా...

మనసులో లోపల ఎక్కడో తను ఇన్నాళ్ళ నుంచీ కోరుకున్న దిదే కదా! అనే సంతోషం కూడ కలిగింది.

అప్పటి నుంచి మీనాక్షి కన్పించినప్పుడల్లా నవ్వడమో, కళ్ళతో మాట్లాడ్డమో చేస్తున్నాడు రాజారావు.

రాజారావు తనవేపు చూసినప్పుడు.. నవ్వినప్పుడు మీనాక్షి మనసు గాలిలో తేలిపోతున్నట్లుండేది!

వారంరోజులు గడిచాయి.

ఒకరోజు మధ్యాహ్నం.

రెండు గంటల వేళ.

మీనాక్షి దండ్లో చాప మీద పెద్దన వత్తిన అప్పడాలు ఎండబెడుతోంది.

బయట తలుపు తట్టిన చప్పుడు విన్పించింది. ఇప్పుడెవరు వచ్చి ఉంటారా అనుకుంటూ తలుపు తీసింది.

ఎదురుగా రాజారావు.

కళ్ళు తిరిగినట్లయింది మీనాక్షికి.

కింద పడకుండా తలుపు పట్టుకుంది.

''లోపలికి రండి!'' అంది.

అతని ముఖం ఎందుకో సంతోషంతో వెలిగి పోతూంది! ఆ వెలుగులో అతని ముఖం మరింత అందంగా ఉంది.

ఉన్న ఒక్క కుర్చీని అతని వేపు జరిపింది మీనాక్షి.

రాజారావు కూర్చున్నాడు.

మాసిన చీర.

రేగిన జుట్టు.

తన అవతారాన్ని చూసి నవ్వడు గదా! అను కుంది.

కొంగుతో ముఖాన్ని తుడుచుకుంటూ చుట్టూ చూసింది.

నల్లగా ఉన్న గోడలు.

దండెం మీద మాసిపోయి వేలాడుతున్న బట్టలు

ఒక పక్కగా ముడులతో నిండిన నవారు మంచం.

మీనాక్షి వాటిని చూసి సిగ్గుపడిపోయింది.

అంత హఠాత్తుగా తన ఇంటికి వచ్చిన రాజారావు మీద కోపం కూడా వచ్చింది. అతడు తొందరగా వెడితే బాగుండుననుకుంది.

రాజారావు మీనాక్షి వేపు రెప్పవేయకుండా చూస్తున్నాడు. ఆ చూపులు మీనాక్షికి ఎప్పటిలా ఆనందాన్ని ఇవ్వటం లేదు. చికాకుని కలిగిస్తున్నాయి.

''కమల గారు ఎప్పుడు వస్తారు!'' అ నడిగింది అతడి వేపు తీక్షణంగా చూస్తూ.

రాజారావు తల వంచుకున్నాడు.

''ఏమో తెలీదు.! నాకు ప్రమోషన్ వచ్చింది ఈ రోజే తెలిసింది. మీకు చెప్పాలన్పించింది'' అన్నాడు గబగబా.

మీనాక్షికి ఆనందం కలిగింది.

కాని, ఈ విషయాన్ని తన ఇంట్లో రాకుండా ఇంకెక్కడైనా చెప్పి ఉంటే ఇంకా ఎంతో సంతోషం కలిగేది.

రాజారావు లేచి నిలబడ్డాడు.

మీనాక్షి కళ్ళల్లోకి చూస్తూ—''వస్తానండీ!'' అంటూ వెనుదిరిగాడు.

అతడు అలా వెళ్ళిపోతుంటే మీనాక్షికి బాధ కలిగింది.


'ఇంకాస్సేపు కూర్చోండి!' అని అనా లన్పించింది..

కాని, మాసిన గోడలు—

చిరిగిన బట్టలు—

ముడులు పడిన నవ్వారు—

జ్ఞాపకం వచ్చాయి మీనాక్షికి!




ఇక ఆ ప్రయత్నం మానుకుంది.

రాజారావు బయటికి వచ్చాడు. మీనాక్షి వరండా లోకి వచ్చింది.

అతడు తన ఇంటి గేటు తీస్తూ మీనాక్షి వేపు చూశాడు.

మీనాక్షి వెనుదిరిగి ఇంట్లోకి వచ్చింది.

ఆ రోజంతా మీనాక్షి మనసు మనసులో లేదు.

రాజారావు ఎంతో అభిమానంతో తనింటికి వచ్చి... తనకు ప్రమోషన్ వచ్చిందని ఎంతో సంతోషంతో చెప్తే ... తను కనీసం అభినందనలన్నా చెప్పలేదు.

అత దేమనుకున్నాడో!

ఇన్నాళ్ళూ తను కోరిందేమిటి?

రాజారావు తనింటికి రావాలని, తనతో మాట్లాడాలని అనుకుంది.

కానీ, తీరా అవకాశం వచ్చాక అతడిని అవ మానించి పంపింది. మీనాక్షి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బాధపడింది. తనని తాను నిందించు కుంది.

అతడిని కలిసి క్షమాపణ అడగాలనుకుంది. అంతవరకూ తనకు మనశ్శాంతి ఉండదని పించింది.

మూడోరోజు సాయంత్రం.—

మీనాక్షి అందంగా తయారయి కమల ఇంటికి వెళ్ళింది. గేటు తీస్తూంటే కాళ్ళు వణికినట్లయింది. మెల్లగా లోపలకు నడిచింది.

పూలమొక్కలు బాగా పెరిగాయి!

విరిసిన పూలు చక్కని పరిమళాన్ని వెదజల్లు తున్నాయి.

పనిపిల్ల మొక్కల మధ్య పూడుస్తోంది.

మీనాక్షిని చూసి దగ్గరికి వచ్చింది.

''ఏం కావాలమ్మా!'' అనడిగింది.

''అబ్బే! ఏం లేదు. మీ అమ్మగారు మొక్కల్ని చూస్తుండమంటే!'' అంటూ నాన్చేసింది!

''రండమ్మా! మాద్దురు గానీ. మొక్కలకి రోజూ పెళ్ళిపోతన్నా! అమ్మగారు వచ్చేసరికి అన్నీ పూలు పూయాలి!'' అంది.

''సరేలే! నీ పని కానీ!''

పనిపిల్ల మళ్ళీ పూడ్చు మొదలెట్టింది.

మీనాక్షి మొక్కల మధ్య తిరుగుతూ, పనిపిల్లతో కబుర్లు చెప్తోంది.

కానీ మనసంతా గేటు మీదే ఉంది. ఇంతలో స్కూటరు శబ్దం వినిపించింది.

మీనాక్షి పెటుక్కున మొక్కల మధ్యకి తప్పు కుంది.

''అయ్యగారొచ్చారు!'' పనిపిల్ల గేటు దగ్గరికి పరిగెట్టింది.

రాజారావు లోపలికొచ్చి స్కూటరు స్టాండు వేశాడు. తలుపుల తాళం తీసుకుని లోపలికి వెళ్ళాడు.

పనిపిల్ల రాజారావు వెనకే లోపలికెళ్ళి మళ్ళీ

18—8—82

వెంటనే తిరిగొచ్చి—

"అమ్మగారూ! నేను వెడుతున్నానండీ" అంది మీనాక్షితో.

"అలాగే! నేను రెండు మల్లెపూలు కోసుకు వస్తాను—నువ్వు పద" అంది మీనాక్షి.

"నన్ను కోయమంటారా!"

"వద్దు లేవే! నేను కోసుకుంటాను నువ్వెళ్ళు."

పనిపిల్ల వెళ్ళిపోయింది.

మీనాక్షి పూలు కోసుకుని నెమ్మదిగా వరండా వేపు నడిచింది.

కర్టెను తొలగించుకుని హాల్లోకి అడుగుపెట్టింది. చుట్టూ చూసింది.

రాజారావు లేడు.

బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది.

రాజారావు సోఫాలో కూర్చుని ఎదురుగా ఉన్న స్టూలు మీద కాళ్ళు పెట్టి, సిగరెట్ కాలుస్తూ కని పించాడు.

జుట్టు చెదిరి ముఖం వివర్ణ పడింది.

ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టున్నాడు. ఆ క్షణంలో అతని ఎదుటికి వెళ్ళాలంటే బెరుకు కలిగింది మీనాక్షికి!

వెనుదిరిగింది.

చేతిగాజులు గలగల్లాడాయి.

రాజారావు తలతిప్పి చూశాడు. మీనాక్షి కన్పిం చింది.

"మీరా!" అతని కళ్ళల్లో ఆశ్చర్యం.

మీనాక్షి అతడి వేపు చూసింది.

రాజారావు స్టూలు మీద నుండి కాళ్ళు తీశాడు. తాను సోఫాలో పక్కకు జరిగి, 'కూర్చోండి' అన్నాడు.

అతని నిర్లిప్తత చూసి మీనాక్షికి నిరాశ కలి గింది.

రోజా తనని చూడగానే తళుక్కుమనే అతని కళ్ళు ఈనాడు ఎటువంటి భావాన్ని వ్యక్తం చేయడం లేదు.

మీనాక్షికి నీరసం ముంచుకొచ్చింది.

నెమ్మదిగా వచ్చి సోఫాలో కూర్చుంది.

రాజారావు లేచి మంచాని కానుకుని నిలబడ్డాడు.

"కమల దగ్గర్నించి ఇంకా ఉత్తరం రాలేదు." అన్నాడు క్షణం ఆగి.

మీనాక్షికి కోపం వచ్చింది.

'ఇప్పు డిక్కడెవరూ ఆవిడ కోసం బెంగెట్టుకుని చావడం లేదు.' మనసులో అనుకుని పైకి మాత్రం "ఊఁ" అంది.

రాజారావు గుండె మీద చేతులు కట్టుకుని, కిటికీలో నుండి బయటికి చూస్తున్నాడు.

అయిదు నిముషాలు గడిచాయి.


మీనాక్షికి సహనం నశించింది. రాజారావు వైఖరి కోపాన్ని, బాధను కలిగించాయి.

రాజారావు తనతో మాట్లాడక పోగా, కన్నెత్తి కూడా చూడడం లేదు.

ఇక తనిక్కడ ఉండడం ఎందుకు?

చటుక్కున లేచి నిలబడింది.

"వెళ్ళొస్తానండీ! కమలగారు ఇల్లు చూస్తూ ఉండమంటే వచ్చాను. వస్తాను" అంది




రాజారావు వేపు ఒక్కసారి చూసి వెనుదిరగ బోయింది.

"మంచిది వెళ్ళిరండి. మళ్ళీ మని మిమ్మల్ని కలుసుకోన మేమో—నాకు ట్రాన్స్‌ఫరయింది. నేను రేపుపొద్దున్న పూర్తు వెడుతున్నాను. కమల అటు నుండి వస్తుంది." అతని కంఠంలో బాధ తొంగి చూస్తోంది.

మీనాక్షి ఆగింది.

రాజారావు ఇక కన్పించడా!

మీనాక్షి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అటు తిరిగి కళ్ళు తుడుచుకుంది.

రాజారావు మీనాక్షి దగ్గరికి వచ్చి ఆమె భుజం మీద చెయ్యి వేశాడు.

మీనాక్షి అతని వేపు తిరిగింది

"ఏడుస్తున్నారా, మీనాక్షీ!"

ఆమె కళ్ళు తుడిచి, మంచం దగ్గరికి తీసుకొచ్చి కూర్చోబెట్టాడు.

తాను కిటికీ దగ్గరగా నిలబడి సిగరెట్ వెలి గించుకున్నాడు.

"మీనాక్షి! ఈ ట్రాన్స్‌ఫర్ నేను కావాలని చేయించుకున్నాను."

మీనాక్షి ఆశ్చర్యంగా చూసింది.

"మీనాక్షి మొదటిసారిగా మిమ్మల్ని చూసి నప్పుడు నా హృదయసుందరి మీరే నన్పించింది. మీకు వివాహమైందని తెలిసినా నా మనస్సు నా మాట వినలేదు. మిమ్మల్నే తలుచుకుంటూ ఏవేవో కలలు కంటూ ఉండేవాడిని."

రాజారావు ఆగి మీనాక్షి వేపు చూశాడు.

మీనాక్షి ఆసక్తిగా వింటూంది.

"మీతో అయిదు నిముషాలైనా మాట్లాడాలనే కోరికతో ఆ రోజు మీ ఇంటికొచ్చాను. నా ప్రమోషన్ విషయం చెప్పాను. కాని, ఆనాడు మీ కళ్ళల్లో నా పైన కోపం తప్ప అభిమానం కన్పించ లేదు. నా ఆశ రాలిపోయింది. మిమ్మల్ని చూస్తూ ఇక్కడ ఉండలేక ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను."

భారంగా అన్నాడు రాజారావు.

అతడు తనని పొరపాటుగా అర్థం చేసుకున్నాడని మీనాక్షి విలవిలలాడిపోయింది.

ఏం చెప్పాలో, తన మనసులోని భావాలు ఎలా బయటపెట్టాలో అర్థం కాలేదు మీనాక్షికి.

"అది కాదండీ...!"

"నాకు తెలుసండీ మీరు చెప్పబోయేది! ఆనాడు జరిగిన దానికి క్షమాపణ అడగడానికి వచ్చారు. అంతేనా!"

"అంతేకాదండీ. ఆ ఇంట్లో నేనేం మాట్లాడ లేను. మా మంచానికున్న ముడులలా నా మనస్సు చిక్కుపడిపోయి ఉంది. ఆ మాసిన గోడలూ, చిరిగిన దుప్పటీ నా మనస్సుపై మసిపూస్తాయి. ఆ ఇంట్లో నేనొక్కతె రాయిని. స్మశానం లాంటి ఆ ఇంట్లో నా ఊహలు, నా ఆశలు, నా కోర్కెలు అన్నీ సమాధి చేయబడ్డాయి! ఆ పై మీనాక్షి మాట్లాడలేకపోయింది.

ఆమె కను కొలకుల్లో నిలిచిన నీళ్ళు ఏ క్షణంలో నైనా జారడానికి సిద్ధంగా ఉన్నాయి.

"మీనాక్షి గారూ! మీ బాధ తెలిసిందండి. మనలాటి వాళ్ళు సుఖపడలేరు. అక్కడ మీ రెలాగో ఇక్కడ నేనూ అంతే. ఈ ఇంట్లో కమల డబ్బుకి అమ్ముడు పోయిన నా బానిస బతుకే జ్ఞాపకం వస్తుంది. మనకిష్టం లేకపోయినా, మనలోని అభి ప్రాయాలతో సంబంధం లేకుండా మన జీవితాలకీ, మనసులకీ కూడా పెద్దలు ముడివేసేశారు. ఆ ముడుల్ని విప్పుకుని మన కోర్కెలు నెరవేర్చు కోవడం మనలాటి వాళ్ళకు చేతకాదు. మన జీవితాలు కూడా ఇలా ఎండ మావుల్లా సాగవల సిందే." బాధగా అన్నాడు రాజారావు.

కొన్ని క్షణాలు ఇద్దరి మధ్య మాటల్లేవు.

ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

రాజారావు హఠాత్తుగా అన్నాడు.

"మీనాక్షీ! దయచేసి మీ రిక్కడ నుండి వెళ్ళి పొండి. ఇలా అంటున్నానని మీరు మరోలా భావించ కండి. ఇక్కడ ఈ క్షణంలో మిమ్మల్ని చూస్తూ నన్ను నేను నిగ్రహించుకోలేను."

మీనాక్షి కళ్ళెత్తి రాజారావు ముఖంలోకి చూసింది.

"అవును, మీనాక్షీ! దయచేసి మీరు తక్షణం ఇక్కడి నుంచి వెళ్ళిపొండి. ప్లీజ్!" అన్నాడు రాజా రావు బాధగా, బరువుగా.

మీనాక్షి లేచింది. లేచి మరోసారి రాజారావు ముఖంలోకి చూసి బయటకు నడవబోయింది!

అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి చెంపల మీదుగా జారుతున్న కన్నీటిని తుడుచు కుంటూ మీనాక్షి బయటికొచ్చి ఇంటివేపు నడవ సాగింది.

మీనాక్షి వెళ్ళిన వేపే చూస్తూ రాజారావు నిట్టూర్చాడు. ✱